క్లుప్తంగా

హాకీ విజేత మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల హాకీ పోటీల్లో నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో రోజు శుక్రవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో మిలిటరీ కాలనీకి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై 2–0 గోల్స్ చేసి మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు గెలుపొందింది. బాలికల విభాగంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టుపై గార్గేయపురం జిల్లా పరిషత్ జట్టు 3–0 గోల్స్ చేసి విజేతగా నిలిచింది. స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో విజేతలకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ కప్పు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, హాకీ అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీ

కర్నూలు(సెంట్రల్): సర్టిఫికెట్ల విడుదలకు సంబంధించి వాది, ప్రతివాదుల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై ఇరు పార్టీలను శాశ్వత లోక్ అదాలత్ రాజీ చేసి పరిష్కారం చూపింది. నంద్యాలకు చెందిన పి.యశోద (వాది), జేపీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ (ప్రతివాది)లో 2021–23లో ఏఎన్ఎం కోర్సులో చేరి పూర్తి చేసింది. అయితే కోర్సు పూర్తి చేసే సందర్భంలోనే ఆమె పూర్తి ఫీజును కళాశాలకు చెల్లించింది. చేరే సమయంలో కళాశాలలో ఇచ్చిన సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని కోరగా యాజమాన్యం అదనంగా రూ.20 వేలు కట్టాలని షరతు పెట్టింది. దీంతో సేవల్లో లోపంగా భావించిన ఆమె లోక్ అదాలత్‌ను ఆశ్రయించడంతో ఇద్దరికి నోటీసులు వారి మధ్య రాజీ కుదుర్చింది. ఆమె రూ.16 వేలు కట్టించడంతో కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లను ఆమెకు అందజేసినట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, రాజుబాబు తెలిపారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి పూజలు చేసి విద్యార్థులు నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ వేడుకలో పాల్గొన్నారు. అంతకు ముందు లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించగా రూ.7,200 ధర పలికింది.

కబోర్డ్స్ వితరణ

కర్నూలు సిటీ: నగరంలోని కోల్స్ మెమోరియల్ హైస్కూల్‌కు ఆ స్కూల్ పూర్వ విద్యార్థి శ్రీ అక్కిమి ప్రమీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ హనుమంతు రెడ్డి ఐదు తరగతి గదులకు కబోర్డ్స్ వితరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రాజా రావుకు అందజేశారు.

ధ్యాన్‌చంద్‌కు నివాళి



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఒలంపిక్ సంఘం సభ్యులు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్టేడియం అధికారులు, సిబ్బంది తదితరులు మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. అలాగే జిల్లా ఒలంపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు, విజయకుమార్, సునీల్ కుమార్, రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు నాగరత్నమయ్య, చిన్న సుంకన్న, పరుశరాముడు, వెంకటేష్‌లు ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

మరమ్మతులు చేపట్టండి

కర్నూలు (టౌన్): నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. కృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వినాయక్‌ఘాట్ వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు చెందిన 9 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో అధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.పైకప్పుల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ఆర్‌ఓ జునీద్, ఆర్ఐలు రాజు, తిప్పన్న, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఖాళీ చేయాల్సిందే!

- ఏ, బీ, సీ క్వార్టర్లలోని అనధికార వ్యక్తులకు హెచ్చరికలు
- సెప్టెంబర్ 7వ తేదీలోగా ఖాళీ చేయకుంటే ప్రత్యక్ష చర్యలు
- నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు ఆదేశాలు
- మూడు క్యాంపుల్లో మొత్తం 953 క్వార్టర్లు
- 490 క్వార్టర్లలో అక్రమంగా నివాసం ఉన్నట్లు గుర్తింపు



బీ క్యాంప్ ఏరియాలో ఓ క్వార్టర్

కర్నూలు(అర్బన్): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లోని ప్రభుత్వ క్వార్టర్లలో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించేందుకు జిల్లా అధికార యంత్రాగం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన ఈ క్యాంపుల్లోని మొత్తం క్వార్టర్లలో సగానికి పైగా అక్రమార్కులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఏళ్ల తరబడి ఆయా క్వార్టర్లలోనే అక్రమంగా నివాసం ఉంటుండగా, మరి కొందరు ఏకంగా తమ సొంత ఇళ్ల మాదిరి ఆయా క్వార్టర్లను అద్దెలకు ఇచ్చుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రెవెన్యూ విభాగంలోని పలువురు ఉద్యోగులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రిటైర్డు ఉద్యోగులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన చోటా నాయకులు, వివిధ సంఘాల నాయకులు దశాబ్దాలకు తరబడి ఈ క్వార్టర్లలో తిష్ట వేశారు. మరి కొందరు నివాసాలను కాస్తా వ్యాపార సంస్థలుగా మార్చేసినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ శాఖలో గతంలో పనిచేసిన పలువురు అధికారులను ప్రసన్నం చేసుకొని ఆయా క్వార్టర్లలను ఆక్రమించుకున్నారు. పలువురు ఉద్యోగులు కనీసం రెండుకు మించి క్వార్టర్లను ఆక్రమించుకుని అద్దెల రూపంలో ఎంజాయ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నగరంలో విద్య, వైద్య, రవాణా తదితర అవసరాలకు అనుగుణంగా ఈ క్యాంపుల్లోని క్వార్టర్లు ఉన్నందున అనేక మంది అధికారికంగా తమకు కేటాయించకున్నా, ఇతరులకు అద్దెలు చెల్లిస్తూ ఏళ్ల తరబడి ఇక్కడే నివాసాలు ఉంటున్నారు.

490 క్వార్టర్లలో అక్రమార్కుల పాగా ...

దాదాపు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మూడు క్యాంపుల్లోని క్వార్టర్లలో దాదాపు 490 మంది అక్రమార్కులు పాగా వేసినట్లు అధికారులు నిర్వహించిన సర్వేలో తేలింది. రెవెన్యూ, నగర పాలక సంస్థ, ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌పీడీసీఎల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి అక్రమార్కుల నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించారు. ఈ నివేదికలపై స్పందించిన జిల్లా కలెక్టర్ అక్రమంగా నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే అక్రమార్కులు సెప్టెంబర్ 7వ తేదీలోగా ఖాళీ చేయాలని ఆదేశించారు. ఖాళీ చేయని పక్షంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, ఏపీఎస్‌పీడీసీఎల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా రంగంలోకి దిగి ఖాళీ చేయించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఏ,బీ,సీ క్యాంపుల్లో అక్రమంగా నివాసాలు ఉంటున్న వారిని ఖాళీ చేయించే పనిలో నిమగ్నమయ్యారు. ఖాళీ చేయని పక్షంలో ఆయా అక్రమ నివాసాలకు నీరు, విద్యుత్ సరఫరాను నిలిపి వేసేందుకు కూడా వెనుకాడనట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పలు అక్రమ నివాసాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేసినా, పక్క క్వార్టర్ల నుంచి సరఫరాను పునరుద్ధరించుకున్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూడు క్యాంపుల్లోని క్వార్టర్ల వివరాలు ...

ప్రాంతం	మొత్తం నివాసాలు	అధికారిక నివాసాలు	అనధికారిక నివాసాలు	శిథిలావస్థలో
ఏ క్యాంప్	52	27	09	16
బీ క్యాంప్	679	252	376	51
సీ క్యాంప్	222	88	105	29
మొత్తం	953	367	490	96



సీ - క్యాంప్‌లో క్వార్టర్స్‌లో ఓ వీధి

ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందే



నగరంలోని ఏ,బీ,సీ క్యాంపుల్లో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలనే ఆదేశాలను తప్పక పాటించాల్సిందే. ఇప్పటికే అక్రమంగా నివాసం ఉంటున్న వారికి ఖాళీ చేయాలని పలుమార్లు నోటీసులు జారీ చేశాం. సెప్టెంబర్ 7వ తేదీలోగా ఖాళీ చేయించాలని జిల్లా కలెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు తమకు సహకారం అందించి ఖాళీ చేయాలి. లేని పక్షంలో వివిధ ప్రభుత్వ శాఖలు బృందాలుగా ఏర్పడి ఖాళీ చేయించే పనిలో నిమగ్నమవుతాయి.

– పీ మహేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

అధికారికంగా ఉన్న వారికి వసతులు కరువు

ఈ క్వార్టర్లలో అధిక శాతం అక్రమార్కులు తిష్ట వేయడం వల్ల వసతుల గురించి ఆయా ప్రభుత్వ శాఖలు పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల అధికారికంగా నివాసం ఉంటున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల చిన్న వర్షాలకే ఆయా క్యాంపుల్లోని రోడ్లు చిత్తడి చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. అలాగే దాదాపు 70 ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్లు కావడం వల్ల మెజారిటీ క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. అనేక క్వార్టర్లలో విద్యుత్ సమస్యలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఉల్లి రైతుల కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



మార్కెట్ యార్డులో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, చిత్రంలో ఎస్పీ, జేసీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జాయింట్ కలెక్టర్ నవ్య మార్కెట్ యార్డులో పర్యటించారు. ఉల్లి ధరలు ఎందుకు తగ్గుతున్నాయని వ్యాపారులను ప్రశ్నించారు. అధిక వర్షాల వల్ల నాణ్యత దెబ్బతినిందని, ఇక్కడ కొనుగోలు చేసిన ఉల్లిని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నామని, అక్కడ రిజెక్ట్ అవుతోందన్నారు. అలాగే రైతులతోనూ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. క్వింటాకు రూ.500 వరకు మాత్రమే లభిస్తోందని, పెట్టుబడిలో 20 శాతం కూడా దక్కడం లేదని, క్వింటాకు కనీసం రూ.2,000 ధర లభిస్తే గిట్టుబాటు అవుతుందని కలెక్టర్‌కు వివరించారు. ఉల్లి రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... మార్కెట్‌కు వచ్చిన రైతులందరికీ న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతను బట్టి ధర ఇవ్వాలని, రైతులు పొలంలోనే గ్రేడింగ్ చేసుకొని వచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వారి వెంట మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, ఏడీ నారాయణ మూర్తి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం



అహమ్మద్ ఆలీఖాన్‌ను సన్మానించిన జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

- పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పార్టీ జిల్లా అధ్యక్షులు తన స్వగృహంలో పార్టీ నగర అధ్యక్షులుగా నియమితులైన అహమ్మద్ ఆలీఖాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. అహమ్మద్ ఆలీఖాన్ నగర పార్టీ అధ్యక్షుడి నియామకంతో ముస్లిం మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్వీ విజయ మనోహరి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విచారణలు గడువులోపు పూర్తి చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): సహకార చట్టాలకు అనుగుణంగా వివిధ సహకార సంఘాల్లో చేపట్టిన విచారణలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ సహకార అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకు సమావేశ మందిరంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంటు రిజిస్ట్రార్లు తదితరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కల్లుదేవకుంట, ఆస్పరి సహకార సంఘాల్లో సెక్షన్ 51 విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ విచారణ నెల రోజుల్లో పూర్తి చేయాలని డీఎల్‌సీవోలను ఆదేశించారు. 10 సహకార సంఘాల్లో రూ.1.62 కోట్లు నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై సెప్టెంబరు నెల చివరిలోపు విచారణ పూర్తి చేయాలని పేర్కొన్నారు. వచ్చే నెల చివరిలోపు ఆడిట్ పూర్తి చేయాలని వివరించారు. సమావేశంలో డీఎల్‌సీవోలు షేక్ జఫ్రీన్, శిరీష, డీసీఏవో చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ముగ్గురు కంటి వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించి కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశారు. ఈ మేరకు వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.పెంచలయ్యను వైఎస్సార్ కడపలోని జీఎంసీకి, డాక్టర్ పి.ఆర్. నివేదితను నంద్యాల జీఎంసీకి, నంద్యాల జీఎంసీలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.కస్తూరి బాయిని అనంతపురం జీఎంసీకి పదోన్నతిపై బదిలీ చేశారు.

జీఎస్టీ వసూళ్లు సజావుగా కొనసాగాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో చట్ట ప్రకారం జీఎస్టీ వసూళ్లు సజావుగా కొనసాగేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జీఎస్టీ వసూళ్ల అంశంపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పన్ను చెల్లింపుదారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌కు సహకరించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లతో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఏపీఐఐసీ, ఆర్టీసీ, మునిసిపల్ కార్పొరేషన్, ఇంజినీరింగ్ శాఖలు జీఎస్టీ వసూళ్లకు సహకరించాలని సూచించారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ జేసీ నీరజ, అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, డిప్యూటీ కమిషనర్ మురళీమోహన్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీటీసీశాంతకుమారి మైన్స్ శాఖ డీడీ రవిచంద్ర, పీఆర్ ఎస్ఈ మద్దన్న, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు సత్కారం



మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కర్నూలు నగర మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన స్వగృహంలో పార్టీ శ్రేణులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్ కుటుంబం ముస్లిం మైనార్టీలకు ఎన్నో మేలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆదిమోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహేష్, దినేష్, మున్నా, జమ్మన్న, మధుసూదన్ రెడ్డి, పర్ల సూరీడు పాల్గొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు కేధార్ నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. శుక్రవారం సీపీఎం బృందం కర్నూలు మార్కెట్‌లో ఉల్లి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకుని అధికారులపై మండిపడ్డారు. మార్కెట్‌కు వచ్చిన కలెక్టర్ పి.రంజిత్‌బాషాను సీపీఎం బృందం కలసి ఉల్లికి రూ.2వేలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, టి.రాముడు, వై.నగేస్ పాల్గొన్నారు.

చంద్రబాబు విఫలం

ఉల్లి రైతును ఆదుకోవడంలో సీఎం చంద్రబాబునాయుడు పూర్తిగా విఫలమయ్యారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సీఎం ఆదేశించినా రైతుల నుంచి కిలో ఉల్లి రూ.12 ప్రకారం ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. వ్యాపారులు సిండికేట్ అయ్యి కేవలం రూ.5కే కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 1న అన్ని మండల కేంద్రాల్లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయనున్నట్లు వివరించారు.

దామోదరం పేరు పెట్టేందుకు సహకరించండి



మేయర్ బీవై రామయ్యకు వినతి పత్రం అందిస్తున్న సాధన సమితి నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాకు రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య పేరును పెట్టేందుకు అందరూ సహకారం అందించాలని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం సమితి గౌరవాధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు నేతృత్వంలో పలువురు నేతలు నగర మేయర్ బీవై రామయ్యను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాకు దామోదరం పేరు పెట్టడం వల్ల భావి తరాలకు ఆయన నీతి గురించి, ఆయన చేపట్టిన పదవుల్లో తీసుకువచ్చిన సంస్కరణలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఆయన జీవితం గురించి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సాధన సమితి ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య, కన్వీనర్ జేవీ క్రిష్ణయ్య, గౌరవ సలహాదారు దామోదరం రాధాకృష్ణ, నాయకులు నాగభూషణం, సీవీ వర్మ, పోతుల శేఖర్ తదితరులు ఉన్నారు.

మారిన జీవనశైలితో కొత్త వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి కారణంగా కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. శుక్రవారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ 4.ఓ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఒత్తిడితో కూడుకున్న జీవితం, క్షణం తీరికలేకుండా మనిషి వ్యాధులతో సతమతమవుతున్నాడని చెప్పారు. ఇందులో అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లు ఉన్నాయని తెలిపారు. వీటిని ముందుగా గుర్తించి చికిత్స అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీలకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాల పునరుద్ధరణకు పోరాడదాం



రాజగోపాల్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసం పోరాడదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం టీజీ ఫంక్షన్ హాలులో సీఐటీయూ నగర మూడో మహాసభలను నిర్వహించారు. సీనియర్ నాయకుడు కేవీ సుబ్బయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించి స్వర్గీయ మాజీ నగర అధ్యక్షుడు కె.రాజగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మోదీ హయాంలో కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. వెంటనే 8 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. పోలవరం, అమరావతికి ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకపోయినా చంద్రబాబు బీజేపీకి మద్దతు పలకడం అన్యాయమన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్, ఉపాధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

నవజాత శిశువుల సంరక్షణపై చర్చ



కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఎం హెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం 'నవజాత శిశువుల సంరక్షణ ఆవశ్యకత' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఆఫ్ మెడివైఫ్స్ ఇండియా సంస్థ(సోమి)వారు హిమాలయ వెల్‌నెస్ కంపెనీ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్దాసుత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు, గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ సావిత్రి, నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర జాస్లిన్ నవజాత శిశు సంరక్షణ పద్ధతులు, ఆరోగ్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం
- నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి. విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ఆర్జీలు, ఎల్ఆర్ఎస్, నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై ఆర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని, నగర ప్రజలు సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకం ద్వారా తమ లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు. వచ్చే అక్టోబర్ నెల వరకు గడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీఎస్ అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవహార భాషాకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి



గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ



ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ ఇందిరశాంతి, తదితరులు



చెబ్రోల్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీదేవిని సన్మానిస్తున్న ఉస్మానియ కాలేజీ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి వ్యవహారిక భాషను అందించిన ఘనత గిడుగుకు దక్కుతుందన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

తెలుగు భాషను పరిరక్షించుకోవడం కోసం ఉద్యమించాలని అరసం నగర ప్రధాన కార్యదర్శి జీవీ ప్రమోద్ చక్రవర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో అరసం నగర శాఖ ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెంకటరమణ, లెనిన్‌బాబు, జి.చంద్రశేఖర్, సోమన్న , రాజశేఖర్, ఈరేష్ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు నగరంలోని సాహితీ ప్రవంతి కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు ఎస్.నాగమణి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ సభాధ్యక్షతన జరిగిన సభలో సభ్యులు డి.పార్వతయ్య, విజయలు తనగల, సూర్యప్రకాష్ రెడ్డి పద్యాలాపన చేశారు.

పలు విద్యా సంస్థల్లో..

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, సిల్వర్‌జూబ్లీ కాలేజీ తెలుగు శాఖ శాఖాధ్యక్షులు డాక్టర్ ఫామిదా బేగంలు పాల్గొని గిడుగు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

- స్థానిక అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో ఆ విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీధర్ పాల్గొని గిడుగు వెంకట రామ్మూర్తి చిత్ర పటానికి పూలల వేసి నివాళ్ళు అర్పించారు.
- ఉస్మానియా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో చెబ్రోల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి శ్రీదేవి, కాలేజీ పూర్వ విద్యార్థి రచయిత సాహితీ ప్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇందులో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.ఏ ఎం.ఘజిని, తెలుగు శాఖాధ్యక్షులు మండి అన్వర్ హుసేన్ పాల్గొన్నారు.
- ప్రభుత్వ బీఈడీ కాలేజీలో ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి అధ్యక్షతన రచయిత జె.ఎస్.ఆర్.కె శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని గిడుగు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఆ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కేవీ మధుసూదన్, తెలుగు అధ్యాపకులు డా.దండెబోయిన పార్వతిదేవి, అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, మహేష్, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఐదుగురు కవులకు 'గిడుగు పురస్కారాలు'



కవులకు గిడుగు రామ్మూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రపంచ ప్రసిద్ధి చెందిన సముద్ర శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఎంపీఎం రెడ్డి స్థాపించిన ప్రముఖ సాహిత్య సంస్థ తెలుగు కళాప్రవంతి కర్నూలుకు చెందిన ఐదుగురు కవులకు గిడుగు రామ్మూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారాలను అందించారు. పురస్కారాలను అందుకున్న వారిలో కవులు ఎస్‌డీవీ అజీజ్, ఎన్.నాగమణి, మారుతీ పౌరోహితం, తెలుగు వెంకటేష్, కెంగార మోహన్ ఉన్నారు. నగరంలోని పింగళి సూరన తెలుగు తోటలో శుక్రవారం గిడుగు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం వేడుకలను నిర్వహిస్తూ మాట పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు ఎం ఎండీ ఇనాయతుల్లా, కన్వీనర్ మహమ్మద్ మియా సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పురస్కార సభకు అధ్యక్షులుగా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, ముఖ్య అతిథిగా గాడిచర్ల ఫౌండేషన్ చైర్మన్ కురాడి చంద్రశేఖర్ కల్కూరా, విశిష్ట అతిథిగా తెలుగు భాషా వికాస ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కె శర్మ పాల్గొని ప్రసంగించారు.